

'రామప్ప' సినిమా షూటింగ్‌లో సుమన్‌తో పద్మజారాణి



పట్టాలతో..



సినారెతో..

# పాండిత్యంలో పట్టపు రాణి

**18 పీజీ, డిగ్రీ, డిప్లొమా పట్టాలు సాధించిన పద్మజారాణి**

**జ్యోతిష్యం, వాస్తులో అపార నైపుణ్యం**

**పంచాంగం, క్యాలెండర్లు రూపొందించిన స్త్రీగా గుర్తింపు**

**ఎన్నో అవార్డులు, ప్రశంసలు సొంతం**

త్యాగరాయగానసభ, టీ మీడియా :

ఓ మహిళ సాధించలేని గుర్తింపును సంపాదించింది ఈడ్పుగంటి పద్మజారాణి. వివిధ కోర్సుల్లో 18 డిగ్రీలు.. జ్యోతిష్యం, వాస్తులో నైపుణ్యం..క్యాలెండర్లు, పంచాంగం రూపకల్పన.. టీవీ ప్రోగ్రామ్‌లో వాఖ్యాతగా..రచనలు, అవార్డులతో ప్రశంసలందుకుంటోంది. తన ప్రతిభను చాటుతూ స్త్రీలకు ఆదర్శంగా నిలుస్తోంది.

విద్య, జ్యోతిష్యం, వాస్తులో అసమానమైన ప్రతిభతో పాటు ఎంఎస్సీ(గణితం), ఎంఎడ్, ఎంఏ తెలుగు, ఎంఏ జ్యోతిష్యం, బీఎల్ క్రిమినాలజీ, ఎంసీవైటీ యోగా, పీజీ డిప్లొమా జ్యోతిర్వాస్తు, ఎంఏ తత్వశాస్త్రం, పీజీ డిప్లొమా కంప్యూటర్స్, పీజీ డిప్లొమా జ్యోతిర్వైద్యం(గోల్డ్ మెడల్).. తదితర 18కి పైగా కోర్సులను పూర్తిచేసింది ఈడ్పుగంటి పద్మజారాణి. జ్యోతిష్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్ అమెరికన్ యూనివర్సిటీ ఫ్లోరిడా (అమెరికా) నుంచి గౌరవ డాక్టరేట్‌ను ఆమె పొందింది. పలు దిన పత్రికల్లో జ్యోతిష్యం, వాస్తుపై దిన, వార, పక్షం, మాసాల్లో రెగ్యులర్ కాలమిస్టుగా ఆమె సేవలను అందిస్తోంది. వనిత చానల్లో జ్యోతిష్యంపై సంవత్సరంపాటు ప్రతిరోజు లైవ్ ప్రోగ్రాంలో ప్రజల జ్యోతిర్వాస్తు సందేహాలకు సమాధానాలిచ్చింది.

**ముద్రిత రచనలు**

నటులు -జాతక యోగాలు, యోగులు యోగజాతకాలు పుస్తకాలను వెలువరించింది. శ్రీఖరనామ, నందననామ, శ్రీవిజయ నామ తెలుగు సంవత్సరాల పంచాగాలను రూపకల్పన చేసి ముద్రించింది. 2012, 2013 క్యాలెండర్లను తెలుగు, ఇంగ్లిష్‌లో తయారుచేసి విడుదల చేసింది..

**ఇతర రంగాల్లో కృషి..**

ఆమె రాసిన కథలు, కథానికలు, వ్యాసాలు, సీరియల్స్ వివిధ పత్రికల్లో ప్రచురించబడ్డాయి. ప్రస్తుతం ప్రముఖ దినపత్రికల్లో గ్రహఫలాలు, జ్యోతిష్య పత్రికల్లో జ్యోతిష్య, వాస్తు సంబంధ అంశాలపై వ్యాసాలు, కాలమ్స్ అందిస్తున్నారు.

**అవార్డులు**

- ఎంఏ జ్యోతిష్యంలో తెలుగు విశ్వవిద్యాలయంలో ఫస్ట్
- జ్యోతిర్వాస్తు విజ్ఞానసంస్థ -హైదరాబాద్ నుంచి బంగారు పతకం.
- స్వచ్ఛంద సంస్థలు, జ్యోతిష్యసంస్థలు, పత్రికల నుంచి జ్యోతిష్య చూడామణి, జ్యోతిష్య రత్నాకర, జ్యోతిష్య కళానిధి, జ్యోతిష్య విశ్వవిజయ్, తదితర బిరుదులను అందుకుంది.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంస్కృతిక శాఖ నుంచి ఉగాది పురస్కారం, టంగుటూరి ప్రకాశం పంతులు స్మారక పురస్కారం (కళానిలయం), ఉగాది పురస్కార్ (భాగ్యనగర్ సరస్వతీ సాహిత్య సేవా సంఘం) చిట్టూరి ఫౌండేషన్, జీవీ



ఆర్, ఆరాధన, సంస్థల నుంచి పురస్కారాలు పొందింది.
- కోటూరి లీలావతి స్మారక అవార్డు, అమెరికా తెలుగు అసోసియేషన్, అమృత్‌కిరణ్ ఉగాది పురస్కారం, గోల్డెన్‌స్టార్ ఎక్సలెన్సీ అవార్డు, కృషిరత్న, మాతృ శ్రీ అవార్డులను సాధించింది.
- ఆల్‌దిబెస్ట్ ఆర్ట్స్ సంస్థ నుంచి వండర్ లేడీ అవార్డును పొందింది. వివిధ సంస్థల నుంచి 100కిపైగా పురస్కారాలను అందుకుంది.
- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, గ్లోబల్ వరల్డ్ రికార్డు, తెలుగు యువ మహిళా జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రపంచస్థాయి అవార్డును తొలి తెలుగు జ్యోతిర్వాస్తు పండితురాలిగా యువ మహిళగా స్వర్ణపతకాలు ఆమెను వరించాయి.

**తల్లిదండ్రుల స్ఫూర్తితో..**

ఈ సందర్భంగా తన జీవిత విశేషాలను పద్మజారాణి వివరించారు. 'అమ్మ దుర్గాకుమారి నుంచి సాహిత్యం, సంగీతం, తండ్రి సూర్యనారాయణమూర్తి నుంచి న్యాయవాదం నాకు కొంత ఉపయోగపడ్డాయి. జ్యోతిష్యం పెద్ద అన్నయ్య రవీంద్రశ్రీనివాస్ నుంచి నేర్చుకున్నాను. ఎమ్మెస్సీలో నా క్లాస్‌మేట్‌గా ఉన్న వ్యక్తినే ఆదర్శ వివాహం చేసుకున్నా. ఇప్పటి వరకు 18 కోర్సుల్లో పట్టా సాధించాను. ఎంత డిగ్రీలు ఉన్నా పంచాంగం రాసిన స్త్రీగా, తొలి తెలుగు యువ మహిళా జ్యోతిష్యురాలిగా కీర్తి రావడం నాకు గర్వంగా ఉంది. ఇవే కాకుండా పలు అందాల పోటీల్లో పాల్గొని బహుమతులు కూడా గెలుచుకున్నా. దూరదర్శన్ చిత్రలహరిలో యాంకరింగ్ కూడా చేశా. దీని వెనుక నా భర్త సహకారం ఎంతో ఉంది. తెలుగు విశ్వవిద్యాలయం జ్యోతిష్యశాఖ డీన్, ప్రొఫెసర్ డాక్టర్ సీవీబీ సుబ్రహ్మణ్యం, ఇప్పుడు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్‌లు నాకు జ్యోతిష్య గురువులు. యూకేజీ చదువుతున్న నా కుమారుడికి సైతం ఐక్యూ చాలా ఎక్కువ. పంచాంగంలోని నక్షత్రాలు, రాశులను, తిథులను అవలీలగా చెబుతాడు. భవిష్యత్తులో మరిన్ని జ్యోతిర్వాస్తు పుస్తకాలను రచించాలనేది నా లక్ష్యం. రామప్ప అనే చలనచిత్రంలో సుమన్ పక్కన నటించే అవకాశం వచ్చింది. అనివార్య కారణాలతో ఆ అవకాశం పూర్తిగా సద్వినియోగం కాకపోవడం బాధ కలిగించింది. పటిష్టమైన ప్రణాళికతో కాలాన్ని సద్వినియోగం చేసుకుని కృషి, పట్టుదలతో జీవితంలో దేనినైనా సాధించవచ్చు' అని తెలిపారు.



## 'గులాబీ కోట'లో పుష్ప విలాసం